ప్రజాశక్తి

మంగళవారం 18 జులై 2023

5

విజయనగరం




ఉషా క్రీడలో పతకాల పంట

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పదో సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఉషా ఛాంపియన్‌షిప్ పోటీలు శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో ఈనెల 15, 16 తేదీల్లో జరిగాయి. పోటీల్లో విజయనగరం జిల్లాకు చెందిన క్రీడాకారులు 9 పతకాలు సాధించారు. రెండు గోల్డ్ మెడల్స్ నాలుగు సిల్వర్ మెడల్స్, మూడు బ్రాంజ్ మెడల్స్ సాధించారు. ఈ టీమ్‌కు కోచ్‌గా బంగారునాయుడు వ్యవహరించారు. వీరిని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు గురానా అయ్యలు, సిహెచ్ వేణుగోపాలరావు, ఉష్ అసోసియేషన్ అధ్యక్షులు జి.శ్రీనివాసరావు అభినందించినారు.

"క్రీడలకు పెద్దపీట వేస్తాం. ఏజెన్సీలోని మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తాం. గిరిజన క్రీడాకారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతాం. సకల సదుపాయాలు కల్పించి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వారు రాణించేలా తోడ్పాటు అందిస్తాం."

ఇవీ ప్రజాప్రతినిధులు, అధికారుల ప్రసంగాల్లో తరచూ వినిపించే హామీలు. ఏదో క్రీడా పోటీల ప్రారంభ సభలో, బహుమతుల ప్రదానోత్సవంలో ఆ హామీలివ్వడం ఆనవాయితీగా వస్తోంది. అంతే తప్ప కార్యరూపం దాల్చడమన్న ప్రశ్నే లేదు. అందుకు నిదర్శనమే సీతంపేట క్రీడా పాఠశాలపై శీతకన్ను వేయడాన్ని చెప్పొచ్చు. వేలకు వేలు ఫీజులు చెల్లించి ప్రయివేటు స్పోర్ట్స్ స్కూళ్లలో చేరుతున్న ప్రస్తుత తరుణంలో, ఉచితంగా, అందుబాటులో క్రీడా పాఠశాల ఉన్నా ప్రవేశాలకు విద్యార్థులు వెనక్కి జంకుతున్నారంటే అక్కడ సదుపాయాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.



క్రీడా పాఠశాల నిర్వహిస్తున్న గురుకుల పాఠశాల ఇదే

క్రీడా పాఠశాలపై శీతకన్ను

- గిరిజన క్రీడాకారులపై అశ్రద్ధ
- అసౌకర్యాల నడుమ నిర్వహణ
- ఆసక్తి చూపని విద్యార్థులు

ప్రజాశక్తి-సీతంపేట

గిరిజన విద్యార్థులు విద్యతోపాటు ఆట, పాటలు, క్రీడలపై మొగ్గు చూపుతారని, వారి నైపుణ్యం వెలికి తీయడానికి 2021లో సీతంపేటకు క్రీడా పాఠశాలను ప్రభుత్వం మంజూరు చేసింది. అంతవరకు బాగానే ఉంది. కానీ ఎటువంటి నిధులు, పరికరాలు మంజూరు చేయలేదు. దీంతో విద్యార్థులు క్రీడా పాఠశాలలో ప్రవేశానికి ఆసక్తి చూపడం లేదు. 2021-22 విద్యా సంవత్సరంలో సీతంపేటకు క్రీడా పాఠశాల మంజూరు చేసి, ఐటిడిఎ సమీపంలో ఉన్న బాలుర గురుకుల పాఠశాలలో ఆదరాబాదరాగా అప్పటి గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర డైరెక్టర్ చినవీరభద్రుడు ప్రారంభించారు. అప్పటినుండి ఇప్పటివరకు 32 విద్యార్థులు మాత్రమే ప్రవేశించారు.

వసతులు కరువు

క్రీడా పాఠశాలకు ప్రత్యేకమైన వసతులుండాలి. కానీ, సీతంపేట బాలుర గురుకుల భవనంలోనే క్రీడా పాఠశాల నిర్వహిస్తున్నారు. ఆ పాఠశాల భవనం కూడా శిథిలావస్థకు చేరుకుంది. దాంతోపాటు క్రీడా పాఠశాలకు విద్యార్థులకు సంబంధించి జావెలిన్‌త్రో, ఫుట్‌బాల్, తదితర క్రీడా పరికరాలు సరఫరా చేయాలి. క్రీడా యూనిఫాం ఉండాలి. ఇవేవీ ఇంతవరకు మంజూరు చేయలేదు. వీరికి ప్రత్యేకమైన భోజనం.. రోజుకు 125 రూపాయలు విలువ చేసే ఆహారం అందించాల్సి ఉంది. కానీ ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో గురుకుల విద్యార్థులకు అందించే ఆహారాన్నే అందిస్తున్నారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం కోసం 46 రూపాయలు మాత్రమే ఇస్తున్నారు. క్రీడాపాఠశాలకు కోచ్‌లు ఐదుగురు ఉండాల్సి ఉన్నప్పటికీ ముగ్గురు ఉన్నారు. క్రీడా పాఠశాలలో ఆరో తరగతి నుండి తొమ్మిదో తరగతి వరకు పాఠశాల ఉంటుంది. గురుకుల ఉపాధ్యాయులతోనే దీనిని నెట్టుకొస్తున్నారు. సీతంపేట క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు తాజాగా సోమవారం గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో ఎంపికలు జరిగాయి. ఈ ఎంపికలకు జోనల్ స్కూల్‌గా సీతంపేట ఉండటంతో శ్రీకాకుళం విజయనగరం పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి విద్యార్థులు హాజరుకావచ్చు. కానీ 88 సీట్లకు 75 మంది మాత్రమే వచ్చారు. అందులో సీతంపేట గురుకుల పాఠశాల నుంచి 73 మంది హాజరయ్యారు. గుమ్మలక్ష్మీపురం నుంచి ఒకరు, శ్రీకాకుళం జిల్లా పెద్దమడి పాఠశాల నుంచి ఒకరు హాజరుకాగా, విజయనగరం జిల్లా పూర్తిగా విద్యార్థులు హాజరుకాలేదు. విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో వారిని చేర్పించేందుకు తల్లిదండ్రులు ముందుకు రావడం లేదు.

ప్రిన్సిపల్ వివరణ

ఈ విషయాన్ని క్రీడా పాఠశాల ప్రిన్సిపల్ తిరుపతిరాజు వద్ద ప్రస్తావించగా, ప్రస్తుతం క్రీడా పరికరాలు రాలేదని చెప్పారు. గురుకులం మెనూ ప్రకారమే ఆహారం అందిస్తున్నామని సమాధానం ఇచ్చారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ఎంపికలు

సీతంపేట : మండలంలో ఐటిడిఎ సమీపంలో ఉన్న గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో క్రీడా పాఠశాలలో ప్రవేశాల కోసం గురుకులాల నోడల్ కన్వీనర్ పి.నాగభూషణం ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ చేపట్టారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జోనల్‌కు సంబంధించి 75 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎస్.తిరుపతిరాజు, ఐటిడిఎ స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి ఎన్.జాకబ్ దయానంద్ పాల్గొన్నారు.



ఎంపిక ప్రక్రియను ప్రారంభిస్తున్న నోడల్ కన్వీనర్

విద్యార్థుల నమోదు శతశాతం కావాలి

జగనన్న సురక్షలో దరఖాస్తులను స్వీకరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శత శాతం జరగాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. 2005 నుండి 2018 లోపు జన్మించిన వారందరిని రెండు రోజుల్లోగా వాలంటీర్ యాప్ ద్వారా సర్వే పూర్తి చేయాలని అన్నారు. 6వ తరగతి నుండి 7 వ తరగతికి, 10 వ తరగతి నుండి 11వ తరగతి కి చేరే విద్యార్థులను తప్పని సరిగా సర్వే చేయాలన్నారు. ఎంఇఒలు, ప్రధానో పాధ్యాయులు వీరిని తదుపరి తరగతులలో శత శాతం నమోదు అయ్యేలా చూడాలన్నారు. బదిలీపై వచ్చి కొత్తగా చేరిన వారి వివరాలను హెచ్‌ఎంలు, ఎంపిడిఒలకు, ఎంఇఒలకు అందజేయాలన్నారు. ప్రతి విద్యార్థి ఎక్కడ చదువుతున్నదీ నమోదు కావాలన్నారు.



స్పందనలో బాధితుల సమస్యలు వింటున్న కలెక్టర్ నాగలక్ష్మి

ఎంపిడిఒలు, తహశీల్దార్లు, ఎంఇఒలు, మండల ప్రత్యేకాధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. జగనన్నసురక్ష, గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో గడప గడపకు, జగనన్నను చెపుదాం, భవన నిర్మాణాల పై మండల వారీగా సమీక్షించారు. గడప గడపకు మన ప్రభుత్వం లో మంజూరు చేసిన పనులన్నీ ఆన్‌లైన్‌లో అప్‌డోల్ కావాలన్నారు. ప్రారంభం కాని పనులు వెంటనే ప్రారంభం కావాలని, ప్రోగ్రెస్ లో ఉన్నవి పూర్తి అయ్యే దశకు చేరాలని అన్నారు. ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న ప్రయారిటీ భవనాల నిర్మాణాలు స్టేజ్ లు వేగంగా మారాలని ఆదేశించారు. 15 రోజుల క్రితం నుండి నేటి వరకు జరిగిన ప్రోగ్రెస్ పై ఆరా తీశారు. పురోగతి కనపడని వారికి ఛార్జ్ మెమోలు ఇస్తామన్నారు. సెప్టెంబర్ 15 లోగా నిర్మాణాలన్నీ పూర్తి చేయాలన్నారు. జగనన్న సురక్ష లో 11 రకాల సేవలను ఉచితంగా అందించాలని అన్నారు. ఇతర సేవలకు దరఖాస్తులు వచ్చినా కూడా స్వీకరించి పరిష్కరించాలని అన్నారు. జారీ అయిన ధ్రువ పత్రాలను వెంటనే అందజేయాలన్నారు. వర్షాకాలం మొదలు అయినందున వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని , గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పరచాలని సూచించారు. ప్రజల్లో డ్రైడే పై అవగాహన కలిగించాలన్నారు. సమావేశంలో డిఆర్‌ఒ గణపతిరావు, సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్, సిపిఒ బాలాజీ, జిల్లా అధికారులు పాల్గొన్నారు

సంతృప్తే లక్ష్యంగా అర్జీలు పరిష్కారం

జగనన్నకు చెబుదాంలో వచ్చిన ఏదైనా అంశంపై వచ్చిన వినతిని ఆయా ప్రభుత్వ శాఖలు పరిష్కరించిన తర్వాత ఆ విషయాన్ని వినతిని అందజేసిన పిటిషనర్‌కు సంబంధిత శాఖల అధికారులు స్వయంగా కలసి తెలియజేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. సంబంధిత వినతి సంతృప్తికరంగా పరిష్కారమైనట్లు ఆయా వినతిదారుల నుంచి ఆమోదం పొందాలన్నారు. జిల్లాలో అర్జీదారుల వినతుల పరిష్కారంలో సంతృప్తస్థాయి ఇంకా మెరుగుపడాల్సి వుందన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా రెవిన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఆర్‌డిఒ ఎం.వి.సూర్యకళ, డిప్యూటీ కలెక్టర్‌లు పద్మలత, సూర్య నారాయణ, సుదర్శన దొర తదితరులు అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా గత వారం రోజుల్లో సంతృప్తికర స్థాయిలో పరిష్కారం కాని వినతులపై జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. సంబంధిత ప్రభుత్వ శాఖలు ఆయా సమస్యలు పరిష్కారం చేసినట్లు చూపిస్తున్నప్పటికీ వినతిదారుల నుంచి సంతృప్తి వ్యక్తం కాకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేసిన వినతులు ఎక్కువగా వుంటున్నాయని, దీనిపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని అన్నారు. వ్యవసాయ, గృహనిర్మాణం, ప్రజారవాణా, పంచాయతీరాజ్, పోలీసు, రోడ్లు భవనాలు, గ్రామీణ నీటిసరఫరా, విద్యాశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖలతో పాటు వలంటీర్ల పనితీరుపై వచ్చిన ఫిర్యాదులపై కలెక్టర్ సమీక్షించారు.

జగనన్నకు చెబుదాంకు 259 వినతులు

కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమానికి వివిధ వర్గాల ప్రజల నుంచి 259 వినతులు అందాయి.

22 నుంచి నియోజకవర్గ స్థాయి సమీక్షలు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాల్లో చేపట్టిన ప్రాధాన్యత కార్యక్రమాలకు సంబంధించిన అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేసేందుకు అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సమీక్షలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అధ్యక్షతన అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరుగుతున్న పనులపై సమీక్షించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు జిల్లాలో ఈనెల 22 నుంచి నియోజకవర్గ స్థాయి సమీక్షలకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, డిప్యూటీ సిఎం బూడి ముత్యాల నాయుడు షెడ్యూలు ఖరారు చేసినట్టు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. 22న విజయనగరం, ఆగష్టు 5న రాజాం, 19న బొబ్బిలి, 26న గజపతినగరం నియోజకవర్గాల సమీక్షలు జరుగుతాయన్నారు. సెప్టెంబరు 16న శృంగవరపుకోట, 23న చీపురుపల్లి, సాలూరులోని మెంటాడ మండలాలకు, 30న నెల్లిమర్ల నియోజకవర్గ సమీక్షలు జరుగుతాయన్నారు. ఆయా రోజుల్లో ఉదయం 10.30 గంటలకు కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో ఈ సమావేశాలు జరుగుతాయని పేర్కొన్నారు. వ్యవసాయం, నీటిపారుదల(నిర్మాణంలోని సాగునీటి ప్రాజెక్టులు), వైద్య ఆరోగ్య, విద్యాశాఖలో నాడు-నేడు పనులు, ఫ్యామిలీ డాక్టర్ విధానం, గృహనిర్మాణం, ఉపాధి నిధులతో కన్వర్జెన్స్ పనులు, గడపగడపకు మన ప్రభుత్వం, ఆయా నియోజకవర్గాల్లోని ఇతర సమస్యలపై ఈసమావేశాల్లో సమీక్షిస్తారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, జిల్లామంత్రి బొత్స సత్యనారాయణ, ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యే, జిల్లా అధికారులు, నియోజకవర్గ స్థాయి అధికారులు ఈ సమావేశాల్లో పాల్గొంటారు.

జెడ్‌పి ఛైర్మన్‌కు బండ్ల గణేష్ పరామర్శ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను)ను ప్రముఖ సినీ నిర్మాత బండ్ల గణేష్ సోమవారం పరామర్శించారు. ఉదయం చిన్న శ్రీను స్వగృహానికి చేరుకుని నరసింగరావు గారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. శ్రీనివాసరావును పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.



ఉపాధ్యాయుడి హత్య కేసులో మరో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-రాజాం

రాజాం మండలం కొత్తపేట గ్రామం వద్ద ఈనెల 15న జరిగిన ఉపాధ్యాయుడు ఏగిరెడ్డి కృష్ణ హత్య కేసులో పరారీలో ఉన్న మరో నిందితుడు మరడాన గణపతిరావును సోమవారం అరెస్టు చేసినట్లు చీపురుపల్లి డిఎస్‌పి ఎఎస్. చక్రవర్తి తెలిపారు. ఏగిరెడ్డి కృష్ణ హత్య తరువాత నిందితుడు మరడాన గణపతిరావు తప్పించుకొనే క్రమంలో పరారీ అయినట్లు తెలిపారు. సోమవారం రాజాం వచ్చినట్లుగా సమాచారం రావడంతో ఎస్ఐ కె.రవికుమార్, సిబ్బంది అరెస్టు చేసారన్నారు. మరడాన రామస్వామి కుటుంబం గతంలో ఉద్దవోలు గ్రామంలో చేసిన కాంట్రాక్టు పనులకు బిల్లులు మంజూరు కాకుండా అడ్డుపడి, సుమారు రూ. 2 కోట్లు తాము అప్పులు పాలైనట్లు చేసి, తమను ఆర్థికంగా నష్టపర్చిన ఉపాధ్యాయుడు కృష్ణను తామే హత్య చేసినట్లుగా విచారణలో నిందితుడు గణపతిరావు అంగీకరించాడని డిఎస్‌పి తెలిపారు. కాగా ఈ హత్యకేసుల్లో నలుగురు నిందితులు మరడాన మోహనరావు, రెడ్డి రాము , మరడాన వెంకటనాయుడు, మరడాన రామస్వామిలను ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే.



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి చక్రవర్తి

ఉపాధ్యాయుడిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలి : యుటిఎఫ్

విజయనగరం టౌన్ : విద్యా రంగ అభివృద్ధి కోసం పని చేస్తున్న ఉపాధ్యాయుడు ఏగిరెడ్డి కృష్ణను రాజకీయ కక్షతో హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమేష్ చంద్ర పట్నాయక్, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ ఉద్దవోలు సహా చుట్టు పక్కల గ్రామాల్లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి, విద్యార్థులకు, యువతకు ఆదర్శం గా నిలిచిన వ్యక్తిని చంపేయడం అన్యాయమని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని రజకుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రజక సమాఖ్య ఆధ్వర్యాన సోమవారం కలెక్టరేట్ వద్ద రజకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జి.సత్యారావు మాట్లాడుతూ దశాబ్దాలు గడుస్తున్నా రజకుల ఆర్థిక సామాజిక స్థితిగతులలో మార్పులేదన్నారు. నేటికీ రజకులు మెజార్టీ కుల వృత్తి పైనే ఆధారపడి దుర్భరమైన జీవనం గడుపుతున్నారని తెలిపారు. చాకిరేవుల దురాక్రమణల నివారణకు ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో కార్యదర్శి ఎం.పైడిరాజు,పైదిచిట్టి.ఎం.అప్పలరాజు రజకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాల్లో 25 వర్కర్లు, హెల్పర్లు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారిత అధికారి బి.శాంతకుమారి తెలిపారు. 4 అంగన్‌వాడీ కార్యకర్తలు, 17 హెల్పర్, 4 మినీ అంగన్‌వాడీల్లో కార్యకర్తల పోస్టులను భర్తీ చేయనున్నట్టు పేర్కొన్నారు. బాడంగి, చీపురుపల్లి, గరివిడి, గంట్యాడ ప్రాజెక్టుల్లో ఒక్కో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు భర్తీకి దరఖాస్తులు స్వీకరించనున్నట్టు వెల్లడించారు. హెల్పర్ పోస్టులు బొబ్బిలిలో 2, చీపురుపల్లిలో 2, గరివిడిలో 3, రాజాంలో 2, వియ్యంపేటలో 3, విజయనగరంలో 5 ఖాళీలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్టు తెలిపారు. మినీ అంగన్‌వాడీల్లో కార్యకర్తల పోస్టులు బాడంగిలో 1, బొబ్బిలిలో 2, గజపతినగరంలో 1, చీపురుపల్లిలో 3, గరివిడిలో 4, రాజాంలో 3, ఎస్.కోటలో 1, వియ్యంపేటలో 3, గంట్యాడలో 1, భోగాపురంలో 1, విజయనగరంలో 5 పోస్టులను భర్తీ చేయనున్నట్టు పేర్కొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసే అభ్యర్థులు కనీసం 10వ తరగతి ఉత్తీర్ణులై వుండాలని, అందులోనూ తెలుగు సబ్జెక్టులో ఉత్తీర్ణులు కావడంతోపాటు తెలుగులో రాయడం, చదవడం తెలిసి వుండాలని పేర్కొన్నారు. అభ్యర్థుల వయస్సు జూలై 1, 2023 నాటికి 21 నుంచి 35 సంవత్సరాల మధ్య వుండాలని తెలిపారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసే అభ్యర్థినులు ఆ గ్రామ స్థానిక వివాహిత అయి వుండాలని పేర్కొన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను అనుసరించి సంబంధిత ఖాళీలకు కేటాయించిన కేటగిరీ అభ్యర్థులు మాత్రమే ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. అర్హులైన ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 22వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా సంబంధిత ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో తమ దరఖాస్తులు అందజేయాలన్నారు.

ఫిర్యాదుదారులకు తక్షణ న్యాయం : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరం

స్పందనలో వినతులు ఇచ్చిన ఫిర్యాదుదారులకు తక్షణ న్యాయం చేయాలని ఎస్‌పి ఎం.దీపిక ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఫిర్యాదులను స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత పోలీసు అధికారులతోవీడియో కాన్ఫరెన్సులో మాట్లాడి, వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీగారు 36 ఫిర్యాదులను స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. గజపతినగరం మండం మధుపాడకు చెందిన ఒకామె ఫిర్యాదు చేస్తూ తాను గజపతినగరం కు చెందిన ఒక వ్యక్తి వద్ద ప్రైవేటు చిట్టీకి గాను రూ.1,50,000 కట్టానని, చిట్టీ వాయిదాలు పూర్తయినప్పటికీ, సదరు వ్యక్తి చిట్టీ సొమ్ము చెల్లించడం లేదని, న్యాయం చేయాలని కోరారు. విజయనగరానికి చెందిన ఒకామె తన ఇంటిలోకి ఒక వ్యక్తి అక్రమంగా తన ఇంటిని జెసిబితో కూలదోసి, ఆ స్థలంలో అక్రమంగా నిర్మాణం చేపడుతున్నారని, న్యాయంచేయాలని కోరారు. గరివిడి మండలం వెదుళ్ళవలసకు చెందిన ఒక వ్యక్తి ..తన ఆస్తిని తీసుకొని, తన బాగోగులు చూడడం లేదని, న్యాయం చేయాలని కోరారు. కొత్తవలస మండలం అర్ధన్నపాలెం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తనకు గ్రామంలో గల భూమిని ఆక్రమించుకోవాలని ఉద్దేశ్యంతో సదరు భూమిని దున్నేందుకు ప్రయత్నించి, తమపై దాడులకు పాల్పడుతున్నారని, న్యాయం చేయాలని కోరారు. గజపతినగరం మండలం పాతబగ్గాం గ్రామానికి చెందిన ఒకామె ఫిర్యాదు చేస్తూ తన భర్త చెడు వ్యసనాలకు అలవాటుపడి, తన కుటుంబ బాగోగులు చూడడం లేదని తెలిపారు. ఎస్‌పి స్పందిస్తూ తక్షణమే విచారణ చేపట్టి వారం రోజుల్లో తనకు నివేదించాలని ఆయా పోలీసుస్టేషన్ల ఎస్‌ఐలను ఆదేశించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డిఎస్‌పి విశ్వనాథ్, డిసిఆర్‌బి సిఐ జె.మురళి, ఎస్‌బి సిఐ ఇ.నర్సింహమూర్తి, డిసిఆర్‌బి ఎస్‌ఐలు పాల్గొన్నారు.



స్పందనలో బాధితుల సమస్యలు వింటున్న ఎస్‌పి ఎం.దీపిక

చెరుకు మద్దతుధరకు 20న ధర్నాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్ర ప్రభుత్వం చెరకు మద్దతు ధర. రాష్ట్ర ప్రభుత్వం సలహా ధర ఇవ్వాలని, జిల్లాలో మూసివేసిన భీమసింగి, ఎన్‌సిఎస్ సుగర్ ఫ్యాక్టరీలను తెరిపించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వద్ద, బొబ్బిలి సుగర్‌కేన్ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నాలు చేయనున్నట్లు ఎపిరైతు సంఘంజిల్లా కార్యదర్శి బి.రాంబాబు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలోని 29 చెరకు ఫ్యాక్టరీల్లో 24 ఫ్యాక్టరీలు మూతపడ్డాయని తెలిపారు. వీటిలో 11 కోఆపరేటివ్ ఫ్యాక్టరీల్లో ఒక్క గోవాడ షుగర్ ఫ్యాక్టరీ మాత్రమే నడుస్తున్నదని అన్నారు. ముఖ్యమంత్రి ఎన్నికల ప్రచారంలో రాష్ట్రంలో మూతపడిన పరిశ్రమలని తెరిపిస్తానని, చక్కెర పరిశ్రమలను ఆధునీకరించి రైతులకు న్యాయం చేస్తానని వాగ్దానం చేసినా నేటివరకు తెరిపించలేదన్నారు.

రాష్ట్రంలో చక్కెర విధానాన్ని రూపొందించుకొని పరిశ్రమను అభివృద్ధి పరచడానికి బదులుగా ఉన్న పరిశ్రమలను మూసివేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తి చూపించడాన్ని రైతు సంఘం ఖండిస్తోందన్నారు. ఫ్యాక్టరీలకు సామర్థ్యానికి సరిపడా చెరకు లేకపోవడం వలన ఫ్యాక్టరీలు మూత పడుతున్నాయని ప్రభుత్వం చెబుతోందని, ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం చక్కెర పాలసీన రూపొందించుకొని పరిశ్రమలను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో తలపెట్టిన ధర్నాల్లో రైతులంతా పాల్గొనాలని కోరారు.

నత్తనడకన నాడు-నేడు

- బిల్లులు రాక మధ్యలో నిలిచిపోయిన నిర్మాణాలు
- పాఠశాలలు ప్రారంభమై నెల కావస్తున్నా కదలని పనులు

ప్రజాశక్తి- నెల్లిమర్ల

ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న నాడు- నేడు పనులు నత్త నడకన సాగుతున్నాయి. ఫలితంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 50 ప్రాథమిక, 4 ప్రాథమికోన్నత, 13 ఉన్నత పాఠశాలలు, బిసి, సాంఘిక సంక్షేమ, కేజీబివి, గిరిజన ఆశ్రమ పాఠశాల, మత్స్యకార పాఠశాల, సతివాడ మోడల్ స్కూల్ మొత్తం 74 పాఠశాలలు ప్రభుత్వ యాజమాన్యంలో నడుస్తున్నాయి. వీటిలో మొదటి దశలో 39 పాఠశాలలకు డ్రింకింగ్ వాటర్, అదనపు తరగతి గదులు, విద్యుత్, మరుగు దొడ్ల సౌకర్యం కల్పించడానికి రూ.14.36కోట్లు విడుదల చేసి పనులు పూర్తి చేశారు. అయితే రెండవ దశలో 45 పాఠశాలలకు రూ.3.16 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించి సంవత్సరాలు గడుస్తున్నా ఇంత వరకూ పనులు పూర్తి కాలేదు. వీటిలో నెల్లిమర్ల కెజిబివి, చనమల్లపేట ఎంపిపి పాఠశాల, చిన బూరాడ పేట 2, బర్లపేట ఎంపిపి పాఠశాల, కొత్తపేట ఎంపిపి పాఠశాల, తాళ్ళపూడిపేట, జెడ్‌పి పాఠశాలలు నెల్లిమర్ల బాలికొన్నత పాఠశాల, జరజాపు పేట, బొప్పడాం, సారి పల్లి, కొండవెలగాడ, రామతీర్థం, సతివాడ, తంగుడుబిల్లి, మొత్తం 14 పాఠశాలలకు అదనపు తరగతి గదులు, ప్రహరీ గోడలు నిర్మాణం చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ ఇంతవరకు పనులు పూర్తి కాలేదు. కాగా బిల్లులు రాక నిర్మాణ పనులు నత్త నడకన జరుగుతున్నట్లు తెలుస్తోంది. పనులు పూర్తి కాక పోవడంతో ఆయా పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రెండో దశ నాడు- నేడు పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు. కొన్ని చోట్ల మొదటి దశ పనులు కూడా ఇంకా పూర్తి కాలేదని విద్యార్థులు బహిరంగంగానే చెబుతున్నారు. రెండో దశ పనులు పూర్తి కాకపోవడానికి ప్రధాన కారణం బిల్లులు కాకపోవడమేనని తెలుస్తోంది. బిల్లులు అందకపోవడంతో పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అనే చందంగా ఉన్నాయి.



సారిపల్లిలో నిలిచిపోయిన పాఠశాల భవన నిర్మాణ పనులు



పూర్తికాని నెల్లిమర్లలోని బాలికల పాఠశాల నిర్మాణ పనులు

విద్యాప్రదాత ఆనంద గజపతిరాజు

ప్రజాశక్తి - జామి

విజయనగరం మహారాజుల బిడ్డగా కాకుండా పేద ప్రజలకు విద్యను సులభంగా అందించాలని స్వర్గీయ పూసపాటి ఆనంద గజపతి రాజు నిరంతరం తపన పడేవారని ఆనంద్ సతీమణి సుధా గజపతిరాజు అన్నారు. మండలంలోని అట్టాడ బిఎస్ఆర్ ఆశ్రమంలో జరిగిన ఆనంద గజపతిరాజు 74వ జయంతి కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. మాజీ మంత్రిగా, ఎంపీగా మాన్సస్ చైర్మన్‌గా ఆనంద్ ఎప్పుడూ ప్రజా సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించారని దేశంలో ఎక్కడాలేని విధంగా మాన్సస్ సంస్థలో వివిధ రకాల విద్యా బోధన డిపార్ట్మెంట్లను ప్రవేశ పెట్టిన ఘనత ఒక్క ఆనంద్ గజపతిరాజుకు మాత్రమే దక్కిందని అన్నారు. ఆశ్రమం నిర్వహకురాలు భీశెట్టి శారదా మాట్లాడుతూ ఆనంద్ గజపతిరాజు రాజకీయాల్లో ప్రజలకి చాలా ఉపయోగకరమైన పనులు చేసారని, విద్యా శాఖ మంత్రిగా రాష్ట్రంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకి అందేలా విశేషంగా కృషి చేశారన్నారు. అనంతరం సుధా గజపతిరాజు వృద్ధులకు బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆనంద్ కుటుంబ సభ్యులు బదరి నారాయణ రాజు, ఆశ్రమం నిర్వాహకులు ఆడారి హరిత సాయిరాజు, తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ కేంద్రం వద్ద ధర్నా చేస్తున్న గ్రామస్తులు

తొత్తడాం గ్రామస్తుల ఆందోళన

ప్రజాశక్తి - పూసపాటిరేగ

పది రోజులుగా తమ గ్రామంలో విద్యుత్ లేకపోవడంతో సోమవారం మండలంలోని గుంపాం పంచాయతీ పరిదిలోగల తొత్తడాం గ్రామస్థులు కొప్పెర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. తమ గ్రామానికి విద్యుత్ ఇచ్చే వరకూ కదిలేది లేదంటూ నినాదాలు చేశారు. గత పది రోజులుగా రేపు రేపంటూ వాయిదాలు వేసుకొస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేశారు. విద్యుత్ లేకపోవడంతో తాగునీరు రావడం లేదన్నారు. ప్రత్యామ్నాయంగా వేరొక లైన్ ఇచ్చినప్పటికీ ఓల్టేజ్ డ్రాప్‌తో తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. అధిక మొత్తంలో వేలాది రూపాయాలు బిల్లులు కట్టించుకొని విద్యుత్ ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ఎఇ నాగేశ్వరావు లేరంటూ సిబ్బంది సమాచారం ఇచ్చినా గ్రామస్థులు అక్కడ నుండి కదల్లేదు. దీంతో విషయాన్ని లైన్‌మేన్ శ్రీనువాసరావు ఎఇకి పోన్‌లో చెప్పారు. వెంటనే ఆయన స్పందించి కొత్త ట్రాన్స్‌పార్మర్ గ్రామానికి పంపిస్తున్నట్లు సర్పంచ్ భర్త యడ్ల రామకృష్ణకు పోన్‌లో తెలిపారు. సబ్‌స్టేషన్ దగ్గర ఉన్న 16 కెవి త్రీపేజ్ ట్రాన్స్‌పార్మర్ మీ గ్రామానికి తీసుకువెల్లాలని తెలిపారు. దీంతో వారంతా వెనుదిరిగారు.



అధికారులతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో శంకుస్థాపన మాస మహోత్సవాలలో భాగంగా సోమవారం 31వ డివిజన్‌లో రూ.35 లక్షలతో నిర్మించనున్న అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శంకుస్థాపనలు చేశారు. గాయత్రి నగర్, భగవాన్ నగర్ లోని రహదారులు, కాలువలకు అరుంధతి నగర్ లోని కాలువలు రహదారుల పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ ఎన్ని లక్ష్మణరావు, జోనల్ ఇంఛార్జి బొద్దాన అప్పారావు మాట్లాడుతూ అభివృద్ధే అజెండాగా నగరంలో జరుగుతున్న ప్రజావసరపనులు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. నగరంలో శివారు ప్రాంతాలలో సైతం రహదారులు, కాలువలు, వీధి దీపాలు, కుళాయిలు వంటి సౌకర్యాలను మెరుగుపరుస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయా యాదవ్, జోనల్ ఇన్‌ఛార్జులు మారం బాల బ్రహ్మారెడ్డి, డివిజన్ నాయకులు రమేష్, రాజశేఖర్, నగరపాలక సంస్థ ఇఇ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

4వ డివిజన్‌లో గడప గడపకు

నగరంలోని 4వ డివిజన్ లో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అమలవుతున్న తీరు అడిగి తెలుసుకుంటూ లబ్ధిదారుల వివరాలతో కూడిన బుక్లెట్లను అందజేశారు. స్థానిక సమస్యల పైన ఆరా తీశారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందలేకపోతున్న వారి వివరాలను తెలుసుకొని అందుకు గల కారణాలను విశదపరిచారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని, ఎమ్మెల్యేగా కోలగట్ల వీరభద్ర స్వామి మరోసారి ప్రజలు ఆశీస్సులు అందించాలని కోరారు. స్థానిక కార్పొరేటర్ మారోజు శ్రీనివాసరావు, సహాయ కమిషనర్ ప్రసాదరావు, ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండోలో మొదటి స్థానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని రాజీవ్‌గాంధీ స్పోర్ట్స్ కాంప్లెక్సులో ఈనెల 15,16తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. రెండో స్థానంలో విశాఖపట్నం, మూడో స్థానంలో ప్రకాశంజిల్లా నిలిచాయి.



క్రీడాకారులను అభినందిస్తున్న ఝాన్సీలక్ష్మి

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుండి సుమారు 250 మంది పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. మొదటి స్థానంలో విజయనగరం జిల్లా 10గోల్డు, 6 సిల్వర్, 4 బ్రాంజ్ పతకాలు సాధించారు. వీరిలో గోల్డు మెడల్ పొందిన వారు ఈనెల 26,27,28, తేదీలలో ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం లక్నోలో జరుగు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

సోమవారం జరిగిన ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ పార్లమెంటు సభ్యులు బొత్స ఝాన్సీలక్ష్మి పాల్గొనగా అతిథులుగా సీతం ఇంజినీరింగ్ కాలేజి డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు, స్టార్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎమ్‌డి సిరిపురం తేజశ్వర రావు, సెట్విజ్ సిఇఒ బి.రామ్‌గోపాలరావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఎం. సతీష్ కుమార్, తైక్వాండో అసోషియేషన్ సభ్యులు డి.యస్.యస్. ప్రసాద్ కుమార్ పాల్గొని క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ తైక్వాండో యుద్ధకల వల్ల శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని, ఇందులో విజేతలకు స్పోర్ట్సు కోటాలో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అన్నారు. మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ క్రీడాకారులకు తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. సిఇఒ రామ్ గోపాల్ మాట్లాడుతూ రాష్ట్రాలకు, జిల్లాలకు పేరుప్రఖ్యాతిలు సాధించాలని కోరారు.

నేరాలు ఘోరాలు

బొబ్బిలిలో చైన్ స్నాచింగ్

ప్రజాశక్తి- బొబ్బిలి

బొబ్బిలిలో చైన్ స్నాచింగ్ జరిగింది. పట్టణంలోని రాజ్ మహల్ కు చెందిన మహిళ సరోజిని సోమవారం నడుచుకుని శివాలయానికి వెళ్తుండగా సంతోషిమాత ఆలయం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మెడలో ఉన్న రెండు తులాల బంగారు పుస్తెలు తాడును తెంచుకుని పరార్ అయ్యాడు. సరోజిని ఒంటరిగా రావడాన్ని గమనించిన దుండగుడు ఆమె వెంట వెళ్లి జనసంచారం లేని సమయంలో మెడలో పుస్తెలు తాడు తెంచుకుని పారిపోయాడు. బాధితరాలు పోలీసులకు పిర్యాదు చేయడంతో సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

ఆలస్య తనిఖీలతో ఫలితం లేదు

ప్రజాశక్తి - రామభద్రపురం

ఇటీవల జాతీయ ఉపాధి హామీ పథకంపై క్షేత్ర స్థాయి తనిఖీలు నిర్వహించి ఆ పదక పనుల్లో తేల్చిన తనిఖీ నివేదికలపై సోమవారం స్థానిక మండల కాంప్లెక్స్ వద్ద నిర్వహించిన బహిరంగ ప్రజా వేదిక సాదాసీదాగా ముగిసింది. ఉపాధి హామీ పథకం జిల్లా అంబుడ్స్‌మెన్ శతపథి అన్నపూర్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ పని చేసినా కొంతకాలం తర్వాత దానిని తనిఖీ చేయడం వల్ల సత్ఫలితాలు రావని, సాంకేతిక కారణాల వల్ల గానీ, వాతావరణంలో మార్పులు వల్ల కానీ కొన్ని పనుల్లో నాణ్యతను గుర్తించలేమని అన్నారు. నిబంధనల్లో పొందుపరిచిన డాక్యుమెంటేషన్ చేయడంతో పాటు ఏడు రకాల రికార్డులు మెయింటైన్ చేయాలన్నారు. ఈ పథకం వేతనదారులుపై ఆధారపడి ఉందని, గ్రామాల్లో వలసలు నివారించడానికి కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ పథకం వేతనదారులు సంఖ్య తగ్గితే నిధులు తగ్గుతాయని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శతపథి అన్నపూర్ణ

క్షేత్ర స్థాయిలో జాబ్ కార్డులు అర్హులందరికీ ఇవ్వాలని, రాజకీయాలకతీతంగా క్షేత్ర సహాయకులు పని చేయాలని కోరారు. జాబ్‌కార్డుల విషయంలో అలక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపిడిఒ రమామణి మాట్లాడుతూ గతేడాది సుమారు రూ.14.68 కోట్లు పనులు జరిగాయన్నారు. ఎపిడి లక్ష్మణరావు ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించిన సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమంలో రాష్ట్ర రిసోర్స్ పర్సన్లు మాధవ్, అచ్యుతరావు ఆధ్వర్యంలో జిల్లా రిసోర్స్ పర్సన్లు వారం పాటు మండల పరిధిలోని 22గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన తనిఖీల్లో గుర్తించిన లోపాలను వివరించారు. చాలా గ్రామాల్లో మార్చిలో చెరువుల పనులు జరగడం వల్ల ఇప్పుడు వర్షాలు పడడంతో కొలతలు తీసుకోవడం జరగలేదని, రహదారుల పనుల్లో కొలతల్లో తేడాలు రావడం సహజమేనని, సంవత్సరం దాటితే 33శాతం తేడా ఉండొచ్చని తెలిపారు. రొంపల్లి కాంపౌండ్ వాల్, ఆరికతోట సచివాలయం, భూశాయవలస అప్పారాయుడు చెరువు పనుల్లో జరిగిన లోపాలపై పంచాయతీ రాజ్ ఎఇ రమేష్, టెక్నికల్ అసిస్టెంట్ వద్ద వివరణ తీసుకున్నారు. ఎంతో హడావిడిగా ప్రారంభమైన సామాజిక తనిఖీ ప్రశ్నించే జనం, ప్రజా ప్రతినిధులు లేక చప్పగా ముగిసింది. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ ఏపిడి రవీంద్ర, క్లస్టర్ ఏపిడి జనార్ధన్, మండల ఏపిఓ కోట సుశీల, హరనాథ్ పాల్గొన్నారు.

దుష్ప్రచారం తగదు

ప్రజాశక్తి- నెల్లిమర్ల



పోతుల రాజప్పన్న

టిడిపి మహిళా నేత వంగలపూడి అనితపై దుష్ప్రచారం తగదని టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న అన్నారు. వంగల పూడి అనిత పై ప్రచార మాధ్యమంలో అనుచితవ్యాఖ్యలు చేయడాన్ని సోమవారం ఆయన ఒక ప్రకటనలో ఖండించారు. మాజీ ఎమ్మెల్యే అనితను కించపరుస్తూ హేయమైన మాటలు ప్రచారం చేయడం సమంజసంకాదన్నారు. ప్రజా స్వామ్య దేశంలో మహిళల కిచ్చిన గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. వైసిపి పాలనలో మహిళలకు గౌరవం లేకుండా పోయిందని ఇటువంటి తప్పుడు ప్రచారం చేసిన మీడియా పై చర్యలు తీసుకోని వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలా కాని పక్షంలో మహిళలు ఆందోళన చేస్తారని హెచ్చరించారు.

ఘనంగా రోటరీ ప్రతినిధుల బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- బొబ్బిలి

2023-24 రోటరీ సంవత్సరానికి రోటరీ ప్రతినిధులుగా పలువురు సోమవారం బాధ్యతలు చేపట్టారు. జెసి రాజు అధ్యక్షుని కాలర్ ధరించి పదవీ స్వీకారం చేశారు. స్థానిక శ్రీ సూర్య రెసిడెన్సీలో ఆయనతో పాటు కార్యదర్శిగా వి.శ్రీహరి, కోశాధికారిగా ఎస్.శ్రీనివాసన్, రీజినల్ సెక్రటరీ తూముల కార్తిక్, రీజినల్ మెంబర్షిప్ చైర్ చంద్ర కిషోర్, రీజినల్ విద్యా చైర్‌గా గెంబలి శ్రీనివాసరావు ఉపాధ్యక్షులుగా కె.నాగరాజు, కార్యనిర్వాహక కార్యదర్శిగా కె రామకృష్ణ, వివిధ విభాగాల చైర్స్ చేత ఇన్స్టలేషన్ అధికారిగా హాజరైన పూర్వపు జిల్లా గవర్నర్ ఆర్‌కె. జైన్ రోటరీ పిన్స్ ధరింప చేసి ప్రమాణం స్వీకారం చేయించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ కె వి అప్పారావు హాజరై సేవలే మనిషిని ఉన్నతునిగా చేస్తాయని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా సేవాకార్యక్రమాలను నిర్వహిస్తూ నమ్మకమైన సేవా సంస్థగా పేరుగాంచిన అంతర్జాతీయ సేవా సంస్థ రోటరీ అని అన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న రోటరీ ప్రతినిధులు

వివిధ విభాగాల చైర్స్ వీరే..

మెంబర్షిప్ చైర్ చంద్ర కిషోర్, ఫౌండేషన్ చైర్ శ్రీనివాస రావు, క్లబ్ సర్వీస్ చైర్ చుక్క శ్రీదేవి, పోలియో చైర్ కిరణ్ కుమార్, సర్వీస్ ప్రాజెక్ట్ చైర్ అప్పల రాజు, ఆన్లైన్ టూల్స్ చైర్ శంకర రావు, పబ్లిక్ ఇమేజ్ చైర్ ప్రవీణ్ కుమార్, యూత్ సర్వీసెస్ చైర్ డేవిడ్ జె విక్టర్, ఎన్విరాన్మెంట్ చైర్ రమణ మూర్తిలచే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ కిరణ్ కుమార్, కో ఎడిటర్ రవి కిషోర్, డిస్ట్రిక్ట్ మెంబర్షిప్ చైర్ శివ రామ్, పోలియో రీజినల్ చైర్ శ్రీ రామ్ ఉపాధ్యాయులు , ఎన్‌జిఒలు హుదా ముస్లిం సంఘ సభ్యులు, డాక్టర్స్, తదితరులు పాల్గొన్నారు.

బాల్యంలో బాగా చదువుకోవాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల



మాట్లాడుతున్న రామకృష్ణ

ప్రతి ఒక్కరూ బాల్యంలో బాగా చదువుకొని ఉన్నత స్థానంలో స్థిరపడాలని సామాజిక, పరివర్తన మార్పు సమాచార వ్యవస్థ జిల్లా సమన్వయ అధికారి బి.రామకృష్ణ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో సోమవారం విద్యార్థులకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, రక్తహీనత, పౌష్టికాహారం, జంక్ ఫుడ్ వల్ల కలిగే ప్రమాదాలు, కెరీర్ గైడెన్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల పేదరిక విష వలయంలో చిక్కుకొంటున్నారని, అనారోగ్యాలతో మరణాలు సంభావిస్తున్నాయని వివరించారు. ప్రతి ఒక్కరూ బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే 112 నంబరునకు సమాచారం అందించాలన్నారు. హిమోగ్లోబిన్ 12 శాతం కంటే తక్కువ ఉంటే రక్తహీనతగా గుర్తెరగాలన్నారు. ఈ సందర్భంగా 'నా బాల్యం చదువు కోసం.. పెళ్లి కోసం కాదు' అనే గోడపత్రికను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రిన్సిపాల్ రమాదేవి, వీరమణి, అప్పలనర్సమ్మ, శాంతకుమారి ఇతర ఉపాధ్యాయులు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

పలుచోట్ల జగనన్న సురక్ష

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బల్లంకి, బానాది సచివాలయాల పరిధిలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో 11 రకాలు సేవలు ప్రజలు ఉపయోగించుకోవచ్చు అన్నారు. ప్రభుత్వ పథకాలకు కావాల్సిన ధ్రువపత్రాలను సచివాలయాల ద్వారా ఉచితంగా పొందవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో కొత్తవలస మార్కెటింగ్ కమిటీ చైర్మన్ మూకల కస్తూరి, జెడ్‌పిటిసి సేనాపతి అప్పారావు, మండల పార్టీ అధ్యక్షులు మమ్ములూరి జగన్నాథం, జెసిఎస్ మండల ఇంచార్జీ బోజంకీ శ్రీను, బల్లంకి సర్పంచ్ బల్లంకి లక్ష్మీ, బానాది సర్పంచ్ కర్రి యశోద, కనకరాజు, బొడ్డు శ్రీను, ఎంపిటిసి తులసి, రామచంద్రుడు మాస్టారు, కృష్ణ, వెంకటరావు, అరిగిపాలెం ఎంపిటిసి రమణ, సచివాలయం కన్వీనర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.



ధ్రువపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

చామలాపల్లిలో గడపగడపకు..

శంగవరపుకోట : మండలంలోని ఆలుగుబిల్లి సచివాలయం పరిధిలో చామలాపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబం సంతోషంగా ఉండటమే ప్రభుత్వం లక్ష్యమన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నామన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ద్వారా వర్తించిన పథకాల ప్రయోజనాలు, ప్రభుత్వ విధానాలు, ప్రభుత్వం పాలన వ్యత్యాసాలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, స్టేట్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, వైసిపి మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, పుణ్యగిరి ట్రస్ట్ చైర్మన్ పొలమరశెట్టి రామకృష్ణ, షేక్ రెహమాన్, ఎఎంసి డైరెక్టర్ డి.పద్మా, చామలపల్లి సర్పంచ్ జుత్తాడ సూర్యారావు, ఎ.శర్మ, బీల వెంకట్రావు, మండల అధికారులు పాల్గొన్నారు.



పేదలకు ఆహార పొట్లాలను పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

ఆహార పొట్లాలు పంపిణీ

ప్రజాశక్తి- బొబ్బిలి

నేను సైతం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పేదలకు సోమవారం ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. 300వ వారం ఆహార పొట్లాలు రాజా కళాశాల డైరెక్టర్ ఆర్.బదరీ పంపిణీ చేశారు. పేదలు ఆకలి తీర్చడం ఎంతో ఆనందదాయకమని బదరీ అన్నారు. నేను సైతం సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సేవా సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు బుక్ సంతోష్, ఎల్.వాసు పాల్గొన్నారు.

పూతికపేటలో జనసేన ప్రచారం

ప్రజాశక్తి- నెల్లిమర్ల

మండల ంలోని పూతికపేట గ్రామంలో జనసేన పార్టీ నెల్లిమర్ల నియోజకవర్గం ఇంచార్జ్ లోకం మాధవి ఆధ్వర్యంలో ఇంటింటికి జనసేన కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా ఆమె గడపగడపకు తిరుగుతూ గతంలో రెండు ప్రభుత్వాలకి మద్దతు తెలియజేసారని, ఇప్పటికీ నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యం అని, ప్రజల బతుకుల్లో మార్పు రావాలంటే పవన్‌ను గెలిపించుకోవాలని కోరారు. పారిశ్రామికంగా ప్రాంతం అభివృద్ధి చెందాలి అంటే వచ్చే ఎన్నికల్లో జనసేన ప్రభుత్వానికి అవకాశం ఇవ్వాలని తెలియజేసారు. ఆ గ్రామంలో ఉన్న ఎస్‌సి కాలనీ కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడం లేదని, తాగునీటి బోరు సమస్య ఉందని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. మాధవి మాట్లాడుతూ ఆ సమస్యలను పరిశీలించి తాను అధికారంలో లేకపోయినా పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లిమర్ల మండలం నాయకులు కురుమజ్జి గోవింద్, పతివాడ శ్రీనివాసరావు, పతివాడ సువర్ణ, శీల ప్రసాద్, యడ్ల పండు, శీర శ్రీనివాసరావు, యడ్ల వెంకటేష్, కొత్తూరు శ్రీనివాసరావు, కార్యకర్తలు వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనసేన నాయకులు లోకం మాదవి

పశువులను విడిచిపెడితే చర్యలు

ప్రజాశక్తి- బొబ్బిలి

రోడ్లపైకి పశువులను విడిచిపెడితే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు హెచ్చరించారు. పట్టణంలో రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతున్న ఆవులను మున్సిపల్ అధికారులు పట్టుకుని వాటర్ ట్యాంకు దగ్గర కట్టివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవుల యజమానులు ఆవులు సంరక్షణ చూడకపోవడంతో కట్టివేశామన్నారు. పశువులను సంరక్షించాల్సిన బాధ్యత యజమానులపై ఉందన్నారు. రోడ్లపై విచ్చలవిడిగా విడిచిపెట్టడంతో ప్రజలు, వ్యాపారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పశువులను రోడ్లపై విడిచిపెట్టవద్దని కోరారు.



రోడ్డుపై విచ్చల విడిగా తిరుగుతున్న ఆవులు



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

హత్యాయత్నం అమానుషం

ప్రజాశక్తి - కొత్తవలస

కృష్ణా జిల్లా, అవనిగడ్డకు చెందిన న్యాయవాది గొరిపర్తి శ్రీనివాసరావుపై సంఘ విద్రోహ శక్తులు దాడి చేయడం హేయమైన చర్యగా భావిస్తూ కొత్తవలస బార్ అసోసియేషన్ నాయకులు తీవ్రంగా ఖండించారు. న్యాయవాదిపై దాడి చేయడాన్ని నిరసిస్తూ సోమవారం కోర్టు విధులకు గైర్హాజరై కోర్టు బయట ధర్నా చేశారు. న్యాయవాది పై పులిగడ్డ వద్ద కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు వెంటాడి దాడి చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం న్యాయవాది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, ఆయన వేగంగా కోలుకోవాలని కోరారు.

వల్లంపూడి బజారులో అపారిశుధ్యం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వల్లంపూడి, వేపాడ జంట గ్రామాలోని బజారు సమీపంలో అపారిశుధ్యం తాండవిస్తోంది. నిత్యం కూరగాయలు, పండ్లు, చేపలు, మాంసం వంటి వ్యాపారాలు చేస్తున్న చోట చెత్త పోగులు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా మాంసం అమ్మే దుకాణం ఉన్న సంధుల్లో చెత్త కుప్పలు తెప్పలుగా ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. దుకాణాల నుంచి పంచాయతీ పాలకులు పన్నులు వసూ చేస్తున్నారే తప్ప అపారిశుధ్యాన్ని తొలగించడం లేదని వ్యాపారులు వాపోతున్నారు. పారిశుధ్యం లోపం వల్ల ఈగలు, దోమలు చేరిన మాంసం, కూరగాయలు కొనడం వల్ల వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి మాంసం దుకాణం వెనుక సందులో ఉన్న చెత్తను తొలగించాలని పలువురు కోరతున్నారు.




మాంసం దుకాణం వెనుక ఉన్న అపారిశుధ్యం

వైసిపి నాయకునికి పితృవియోగం

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని మోదవలస గ్రామానికి చెందిన మండల స్థాయి వైసిపి నాయకులు, కిట్టు రెస్టారెంట్ యజమాని, నాగవంశపు సాధన కమిటీ కన్వీనర్ ఎర్నింటి కృష్ణ(కిట్టు)కు పితృవియోగం కలిగింది. ఆయన తండ్రి కన్నయ్య(75) అనారోగ్యంతో సోమవారం తగరపువలసలోని ఒక ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఫోన్‌లో కృష్ణకు మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని సంతాపం తెలిపారు. ఎంపిపి బంటుపల్లి వెంకటవాసుదేవరావు, రాష్ట్ర నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ బోను అప్పలనాయుడు, వైసిపి అధికార ప్రతినిధి, మోదవలస సర్పంచ్ కనకల రామారావు, ఉత్తరాంధ్ర లారీ అసోసియేషన్ అధ్యక్షులు మద్దిల వెంకటరమణ, బుగత రమణ, వైసిపి నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.




కృష్ణ

ట్రిపుల్ ఐటి విద్యార్థులకు సన్మానం

ప్రజాశక్తి- గరివిడి

చీపురుపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉత్తమ మార్కులతో పాసవడంతో పాటు ట్రిపుల్ ఐటికి ఎంపికైన విద్యార్థులను ఎంపిపి ఇప్పిలి వెంకటనరమ్మ, జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీష చేతులు మీదుగా ఘనంగా సన్మానించారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం ట్రిపుల్ ఐటికి ఎంపికైన 11 మంది విద్యార్థులను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ మండలం నుంచి ఇంత మంది ఎంపికవడం ఆనందంగా ఉందన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాల, మెట్టపల్లి జిల్లా పరిషత్ పాఠశాల, కర్లాం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులను సత్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె రామకృష్ణంరాజు, ఎంఇఒ యమ్. బిసినాయుడు, ఇటకర్లపల్లి సర్పంచ్ మీసాల వెంకటరమణ, మెట్టపల్లి ఎంపిటిసి మీసాల ఈశ్వరరావు, శివాలయం డైరెక్టర్ ప్రభాత్ కుమార్, స్కూల్ కమిటీ చైర్మన్ మీసాల సీతారాం, ప్రధాన ఉపాధ్యాయులు యస్ కె. బేగం, విజయ్‌కుమార్, యస్. కామేశ్వరి, ఉపాధ్యాయులు, మండల సోషల్ మీడియా కో - కన్వీనర్ పేకాపు ప్రసాద్, మహంతి మురళీ, డబ్బాడ ఆనంద్ విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఏగిరెడ్డి కృష్ణ కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి- బొబ్బిలి

తెర్లాం మండలం ఉద్దవోలు గ్రామంలో ఇటీవల హత్యకు గురైన ఉపాధ్యాయుడు ఏగిరెడ్డి కృష్ణ కుటుంబాన్ని టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి బేబినాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా సోమవారం పరామర్శించారు. తామంతా కృష్ణ కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యాన్నిచ్చారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ ఇటువంటి దుర్మార్గమైన చర్యకు పాల్పడిన నిందుతులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ దుశ్చర్యపై ప్రజలందరూ సమయమనం పాటించి శాంతియుతంగా ఉండాలన్నారు.



కృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బేబినాయన, రాజా

ఎరియర్స్ సకాలంలో అందించాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఈ వృద్ధాప్యంలో ప్రభుత్వం నుంచి రావాల్సిన ఎరియర్స్ సకాలంలో అందించాలని రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రౌతు రామమూర్తి కోరారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో మండల విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు (పెన్సనర్స్) సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 3 లక్షలకు పైగా పెన్సనర్స్‌కి ప్రతి నెలా ఒకటో తారీఖను పెన్సన్ చెల్లించాలన్నారు. డిఆర్ బకాయిలు పిఆర్‌సి బకాయిలు ఏక మొత్తంగా వెంటనే చెల్లించాలన్నారు. సమావేశంలో నిర్ణయాలను పోస్ట్ కార్డ్స్ ద్వారా సిఎంకు తెలియజేస్తామన్నారు. ఈ సమావేశంలో విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగుల సంఘ నాయ కులు, రిటైర్డ్ రాజా కాలేజీ ప్రిన్సిపాల్ చెలికాని చెల్లారావు, అసోసియేటెడ్ అధ్యక్షులు యుక్తులు యల్ జగన్నాథం, బొత్స సత్యనారాయణ, సెక్రటరీ చుక్క శ్రీ రామమూర్తి, బెల్లం రమణ, యల్. సూర్య నారాయణ, మరిశర్ల సింహాచలం నాయుడు, వెంకట్రావు, తెర్లాం, బాడంగి, రామభద్రపురం, బలిజిపేట, బొబ్బిలి అర్బన్, రూరల్ మండలంలోని అందరు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



పోస్టుకార్డులను చూపిస్తున్న పెన్సనర్లు